కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు జిల్లా వ్యాప్తంగా సోమవార నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మెకు పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలన్నారు. కనీసవేతనం రూ.26వేలు అందించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. మినీటీచర్స్‌ను ఎటువంటి షరతులు లేకుండా మెయిన్ టీచర్స్‌గా గుర్తించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు అందించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ అందించాలని కోరారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



గార్ల: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు



పెద్దవంగర: సమ్మెకు మద్దతు తెలుపుతున్న పెద్దగాని సోమయ్య



బయ్యారంలో..



దంతాలపల్లి: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



కురవి: దీక్షను ప్రారంభిస్తున్న పోతుగంటి మల్లయ్య



తొర్రూరులో..



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



గూడూరులో..



గంగారంలో...

క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ మాలోతు కవిత అన్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం రూ.10,42,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 46మంది లబ్ధిదారులకు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌పాషా, రాము, వెంకటేష్, ప్రవీణ్, యుగేంధర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం



కురవి: మండల కేంద్రంలో సీరోలు, కురవి మండలాల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా ఎంపిక పోటీలు సోమవారం హైస్కూల్ మైదానంలో వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహరావు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13వ తేదీన డోర్నకల్ మండల కేంద్రంలో జోన్ స్థాయి పోటీలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఓ.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు దార్ల సునీల్, కమల్‌కిషోర్, కాశీనాథ్, విజయ్‌చందర్, రవికుమార్, అనిల్, వసంత పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలకు, ప్రముఖ వ్యాపారవేత్త గోరంట్ల సతీష్ దోమతెరలను ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్‌కు సోమవారం బహూకరించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు ఒక్కొక్క సీటు ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అటవీ అధికారుల సంస్మరణ దినోత్సవం

గంగారం: గంగారం మండలంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం అటవీ అధికారుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో అటవీ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ చలపతిరావు, డీఆర్‌ఓ సతీష్, సెక్షన్ ఆఫీసర్ నర్సయ్య, లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుర్తుతెలియని మహిళ మృతి చెందిందని టౌన్ సీఐ వై.సతీష్ సోమవారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాలు వయసు గల ఒక మహిళ ఈనెల 7వ తేదీన ఆస్పత్రిలో వైద్యంకోసం చేరగా చికిత్స అందిస్తుండగా ఈనెల 9వ తేదీ ఉదయం చనిపోయిందన్నారు. ఆమెను గుర్తు పట్టేందుకు ఎలాంటి ఆధారాలు లేవని, యాచకురాలుగా భావిస్తున్నామని తెలిపారు. ఆమె మృతదేహంను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరచి ఉదన్నారు. ఎవరైనా గుర్తుపడితే నంబర్ 87126 56930 సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ హైదరాబాద్ చాప్టర్ కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన భౌతికరసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు వి. గురునాథరావుని ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్తమ ఉధ్యాయులుగా ఎంపికైన దీపిక, ఝాన్సీ, శ్రీనివాస్ రెడ్డిలను సన్మానించారు. అలాగే జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికై న బానోత్ కిషన్ నాయక్, మధ్యల వీరస్వామిలను జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్, సంఘం నాయకులు దేవ్ సింగ్, శ్రీనివాస్, మహేందర్, లాల్ నాయక్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని అక్షర పాఠశాలకు చెందిన ఎస్.యాకయ్య, మహేష్, సుకన్య ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. వారిని ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, డీఈఓ రామారావు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్, నోడల్ హెచ్ఎం కొత్త జగన్మోహన్ రెడ్డి, చిర్ర యాకాంతంగౌడ్ పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీలు, ఆయాలు సోమవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు, వీరలక్ష్మీ, మహతి, సరస్వతి, జమాలీబీ, పద్మ, శ్రీదేవి, జ్యోతి, కవిత, ఎల్లమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి, కీసర సామ్యరెడ్డి, పెరుగు వరలక్ష్మీ, స్వప్న, మరియ, గీతారాణి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

గార్ల: రైతులు పంటపొలాల్లో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వలన చీడపీడల నివారణతోపాటు, పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ కావటి రామారావు సూచించారు. సోమవారం మండలం లోని సేరిపురం పంచాయతీలో పత్తి, మిరుప, వరిపంటల్లో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం

డోర్నకల్: కొద్ది రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం పడింది. ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజానికి సంబంధించిన బిల్లులు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, మన ఊరు మనబడి కార్యక్రమ ప్రగతి, యూడైస్ నివేదికల లాంటి పనులు నిలిచిపోయాయి. ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం ఉండడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు.

కేసీఆర్ పాలనను స్వాగతిస్తున్నారు..

● ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నెల్లికుదురు: రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ పాలనను ప్రతీ ఒక్కరు స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని కాసియాతండాకు చెందిన పలు పార్టీల నాయకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం మండలంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే కేసీఆర్ లక్ష్యమని, మానుకోటను మరింత అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు, ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికీ చేరేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, నాయకులు పరిపాటి వెంకట్‌రెడ్డి, యాసం రమేష్, బిక్కునాయక్, గుండా వెంకన్న, విజయ, మహేశ్, ఫరీష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

కురవి: గృహలక్ష్మీ పథకంలో ప్రతి పేదవాడికి ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివాసయోగ్యమైన ఇళ్లు లేక పేదవాళ్లు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు, బీసీబంధు పథకాలను అర్హులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు నాగేశ్వర్ రావు, శ్రీనివాస్, సమ్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలి

● జాటోతు హుస్సేన్‌నాయక్



కరపత్రం అందజేస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట నియోజవర్గానికి ఎమ్మెల్యేగా ప్రజలు తమ ఓటు ద్వారా అవకాశం కల్పించాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి శనగపురంలో సోమవారం పల్లె పల్లెకు బీజేపీ, ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. అనంతరం మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో బోరింగ్, రామ్ సింగ్, రామోజీ, కుమ్మరికుంట్ల, జగ్గు, వీరారం తండాలో పర్యటించి ఇంటింటికీ పిడికెడు మట్టిని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు సురేందర్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు నాయక్, మహిళా ఉపాధ్యక్షురాలు ఓర్సు పద్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

22న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 22వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, రాజేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, మోడెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మహబూబాబాద్: దీక్షలో పాల్గొన్న నాయకులు

మహబూబాబాద్: ఈనెల 18నుంచి 22వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టభద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.అనిల్, ఎంఎస్పీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రజియా డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో అంజిబాబు, రమేష్, సమ్మయ్య, సుమిత్ర, యాకన్న, సురేష్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై బీజేపీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలెపాక ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బిక్షపతి, వెంకటేష్, వెంకటేశ్వర్లు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

డోర్నకల్: డోర్నకల్ పట్టణంలో విక్రయించేందుకు గుడుంబాను తెస్తున్న బుద్దారంతండాకు చెందిన రవి అనే వ్యక్తి వద్ద పది లీటర్లు గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాలాభిషేకం

తొర్రూరు: స్వర్ణకార సంఘ భవన నిర్మాణానికి 3 గుంటల భూమి, రూ.20లక్షలు కేటాయించడాన్ని హర్షిస్తూ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావుల చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మామిండ్లపల్లి నగేష్, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకన్న, ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ జడ్జి(ఏడీజే) మేక ప్రశాంతి, నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్, న్యాయ నిపుణులు మేక సునీల్‌రెడ్డి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మరిపెడ రూరల్: చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ రూరల్: ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని చిల్లంచర్ల గ్రామ శివారు రామలింగేశ్వర చెరువులో ఉచిత చేప పిల్లలను సోమవారం పంపిణీ చేశాడు. అనంతరం చెరువు కట్టపై కాకతీయుల కాలం నాటి రామలింగేశ్వర ఆలయంతో ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, సర్పంచ్ నూర్జహాన్ సత్తార్, జిల్లా మత్స్య మధ్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్, ప్రమోటర్స్ ధనుంజయ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించాలి

నర్సింహులపేట: నేనే స్థానికుడిని.. ప్రజాసేవే నా లక్ష్యమని, ఆశీర్వదించి మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, మండల కేంద్రానికి చెందిన యువజన నాయకుడు కొటగిరి చంద్రశేఖర్‌గౌడ్, మరికొందరు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే సంఘీభావం వ్యక్తం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో డీఎస్ రవిచంద్ర, ఎంపీపీ టేకుల సుశీల, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, సర్పంచ్ వేముల రజిత, వైస్ ఎంపీపీ దేవేందర్, చైర్మన్ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సమ్మెను ఎమ్మెల్యే రెడ్యానాయక్ సందర్శించాడు. భవిష్యత్‌లో వేతనాలు పెంచే అవకాశం ఉందని, సమ్మెకు దిగడం సరికాదన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్) గ్రామంలోని తిరుమల కాలనీలో జెడ్పీ నిధులు రూ.7లక్షలతో సీసీ డ్రెయినేజీ పనులను జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, వార్డు సభ్యులు భవానిఉపేందర్, ఈర్ల వీరమ్మ కృష్ణ, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓలకు సన్మానం

మహబూబాబాద్ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–4 గా ప్రమోటైన సందర్భంగా మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు జెడ్పీసీఈఓ రమాదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

వైద్య పరీక్షలు

కేసముద్రం: మండలంలోని కల్వల జెడ్పీఎస్ఎస్‌లో సోమవారం ఆర్‌బీఎస్‌కే మహబూబాబాద్ వైద్యులు శివరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ సౌమ్య కుమారి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కురవి: మండల కేంద్రంలో పద్మశాలీ మండల యువజన సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండేటి యుగేందర్, ప్రధాన కార్యదర్శిగా మెతుకు సురేష్, కోశాధికారిగా కటకం నరేష్, ఉపాధ్యక్షుడిగా కూరపాటి అశోక్, కార్యవర్గ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు.

మండలస్థాయి క్రీడా ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 13వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాల పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చాంప్లనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పీఈటీ సోమవారం పరిశీలించారు. ఆసక్తిగల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

బాధితులకు అండగా నిలవాలి

తొర్రూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కాసర్ల రవికుమార్ అన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌కు సంఘం ఆధ్వర్యంలో రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్రాచారి, వెంకన్న, సుమన్, రవికుమార్, సాయికిరణ్, ఎల్లారెడ్డి, వెంకటాద్రి, పవన్, వినయ్, హరిమోహనాచారి పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన సహదేవ్ సోమవారం సోమవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా గ్రామంలోని ఆలయం వద్ద వాహనం అదుపు తప్పి గోడకు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీసీబంధు యూనిట్లను పర్యవేక్షించాలి

డోర్నకల్: మండలంలో బీసీబంధు లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎంపీడీఓ చలపతిరావు కోరారు. సోమవారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. 40మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల ప్రభాకర్ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈమేరకు సర్పంచ్, ఉపసర్పంచ్ చొరవతో మిత్రులు కలిసి జమచేసిన రూ.75వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్‌ను సోమవారం మృతుడి భార్యకు అందజేశారు. సందీప్, అనిల్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వానరాల బెడదకు చర్యలు

మహబూబాబాద్: కోతుల సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో సోమవారం కోతులను పట్టే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కమిషనర్ టి.ప్రసన్నరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీహరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో శ్రావణమాస చివరి సోమవారం పురస్కరించుకొని పూజలు నిర్వహించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ ఫణిధర్ దంపతులు కుటుంబ సమేతంగా శివలింగానికి అభిషేకాలు చేశారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన ఎమ్మెల్యే

కురవి: సీరోలు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ ఎడవెల్లి వెంకటరెడ్డిని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోకేను అందజేసి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ఐకానిక్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేత

గార్ల: సౌత్ ఇండియా ఐకానిక్ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డును గార్ల బీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు భూక్యా రమేష్, వాంకుడోత్ ఉమాదేవిలు గుంటూరులో సోమవారం రిటైర్ కలెక్టర్ లక్ష్మికాంత్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సింహులపేట: అక్రమంగా గుడుంబాను తయారు చేస్తున్న ఇద్దరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ సోమవారం తెలిపారు. రూప్లాతండా, హూన్యాతండాలో గుడుంబాపై తనిఖీలు చేయగా హూన్యాతండాలో జమున, అనుసూయ వారిని పట్టుకొని వారి నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యత లేకనే రాజీనామా

పెద్దవంగర: బీఆర్‌ఎస్ పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతోనే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు వడ్డెకొత్తపల్లి సర్పంచ్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ దంతాలపల్లి రవి తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన బీసీసెల్ మండల అధ్యక్షుడు బండారి వెంకన్న, ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శి దంతాలపల్లి ఉపేందర్, మైనార్టీ సెల్ మండల ప్రచార కార్యదర్శి సైదులు, పాలకుర్తి నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, తాపీ యూనియన్ గ్రామ అధ్యక్షుడు యాకయ్యలతో పాటు మాజీ ఉప సర్పంచ్ వసంత, వార్డు సభ్యులు నర్సమ్మ, ఎల్లయ్య, సోమ్లా, మాజీ వార్డు సభ్యులు వెంకన్న, ఎల్లమ్మ, చందర్, తురక సుధాకర్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాఉ మాట్లాడుతూ.. తమ సంతకాలతో కూడిన రాజీనామా పత్రంను వాట్సాప్‌లోపంపించినట్లు తెలిపారు. సుమారు 200 మందితో తదుపరి కార్యచరణ త్వరలో వెల్లడిస్తామన్నారు.